

## టైగర్ కా హుకుం.. రిపీట్..

74ఏండ్ల వయసులో కూడా క్షణం తీరిక లేకుండా షూటింగుల్లో పాల్గొంటూ న్యూ జనరేషన్‌కి ఇన్‌స్పిరేషన్‌గా నిలుస్తున్నారు సూపర్‌స్టార్ రజనీకాంత్. మొన్నటి వరకూ ఆయన 'కూలీ' షూటింగ్‌లో బిజీబిజీగా ఉన్నారు. ఆ సినిమాకు సంబంధించిన తన పార్ట్ కంప్లీటయ్యిందో లేదో.. వెంటనే 'జైలర్ 2' షూటింగ్‌ని మొదలుపెట్టేశారు తలైవా. ఆదివారం చెన్నైలో షూటింగ్ మొదలైంది. రెండు వారాలపాటు ఈ షెడ్యూల్ కొనసాగుతుందని, రెండో షెడ్యూల్ ఏప్రిల్‌లో ఉంటుందని మేకర్స్ చెబుతున్నారు. ఫస్ట్ పార్ట్ 'జైలర్' రజనీకాంత్ కెరీర్‌లోనే అత్యధిక వసూళ్లు రాబట్టి బ్లాక్ బస్టర్ హిట్‌గా నిలిచింది. ఆ సినిమాకు సీక్వెల్ అనగానే 'జైలర్ 2'పై అంచనాలు ఆకాశంలో ఉన్నాయి. తొలి పార్ట్‌లో నటించిన రమ్యకృష్ణ, వినాయకన్, యోగిబాబు, తమన్నా.. ఇందులో కూడా కీలక పాత్రలు పోషిస్తున్నారు. ఇక ఫస్ట్ పార్ట్‌లో మాదిరిగానే ఈ సెకండ్ పార్ట్‌లో కూడా వివిధ భాషల నుంచి కొందరు స్టార్లు మెరవనున్నారని టాక్. ఆ వివరాలు త్వరలో తెలుస్తాయి. సన్ పిక్చర్స్ పతాకంపై కళానిధి మారన్ ఈ సినిమాను నిర్మిస్తున్న విషయం తెలిసిందే.



## కోపం వస్తే ఇప్పటికీ అదేపని చేస్తా!

ఇటీవల ఓ ఇంటర్వ్యూలో చిన్ననాటి ముచ్చట్లను గుర్తు చేసుకున్నారు మలయాళ మందారం కీర్తి సురేష్. చిన్నప్పటి తన అల్లరి గురించి చెబుతూ 'చిన్నతనంలో బాగా అల్లరి చేసేదాన్ని. మా అమ్మనైతే ఓ రేంజ్‌లో ఆడుకునేదాన్ని. నాకు బాగా గుర్తు. నన్నెవరైనా తిడితే.. వాళ్లు రూమ్‌లో ఉన్నప్పుడు బయట గడి పెట్టేసేదాన్ని. ఆ విధంగా మా అమ్మను చాలాసార్లు ఏడిపించా. మీకో విషయం తెలుసా?.. ఇప్పటికీ నాకు కోపం వస్తే అదే పనిచేస్తా.' అంటూ అందంగా నవ్వేసింది కీర్తి సురేష్. ఇంకా చెబుతూ 'నాకు చిన్నప్పుడు రూపాయి కాయిన్స్‌ని నోట్లో పెట్టుకోవడం అలవాటు. అలా రెండుసార్లు కాయిన్స్‌ని మింగేశాను కూడా. ఆ అలవాటు మానడానికి చాలా టైమ్ పట్టింది. నిజంగా నా ప్రవర్తనలో మార్పు తీసుకొచ్చింది సినిమాలే. సినీ నటిని అయ్యాక, నేను పూర్తిగా మారిపోయా. ముఖ్యంగా 'మహానటి' సినిమా వృత్తిపరంగానే కాదు, వ్యక్తిగతంగా కూడా నాలో చాలా మార్పు తెచ్చింది.' అంటూ చెప్పుకొచ్చింది కీర్తి సురేష్.



## తారక్ కోసం పవర్‌ఫుల్ టైటిల్?

'ఆర్‌ఆర్‌ఆర్'తో పాన్ ఇండియా ఇమేజ్ సొంతం చేసుకున్నారు తారక్. అందుకే సినిమాల సెలక్షన్‌లో కూడా ఆచితూచి ముందుకెళ్తున్నారాయన. పూర్తి స్థాయి బాలీవుడ్ సినిమా 'వార్ 2'లో ఆయన నటించడానికి కారణం కూడా అదే. ఈ సినిమాతో బాలీవుడ్ ప్రేక్షకులకు మరింత చేరువ కాబోతున్నారు తారక్. ఈ ఏడాది ఆగస్ట్‌లోనే 'వార్ 2' విడుదల కానుంది. ఇటీవలే ప్రశాంత్‌నీల్ 'డ్రాగన్' షూటింగ్ కూడా మొదలైంది. ఇదిలావుంటే.. ఈ రెండు సినిమాల తర్వాత తారక్ చేయబోయే సినిమాపై ఆసక్తికరమైన అప్‌డేట్ ఫిల్మ్ సర్కిల్స్‌లో వినిపిస్తున్నది. 'డ్రాగన్' తర్వాత తమిళ దర్శకుడు నెల్సన్ దర్శకత్వంలో తారక్ సినిమా చేయనున్నారని విశ్వసనీయ సమాచారం. ఈ సినిమాకు 'రాక్' టైటిల్‌ని కూడా నెల్సన్ ఖరారు చేశారట. పాన్ ఇండియా ప్రేక్షకుల్ని దృష్టిలో పెట్టుకొనే నెల్సన్ ఈ టైటిల్ పెట్టారని ఫిల్మ్ వర్గాల టాక్. తారక్ 'డ్రాగన్', నెల్సన్ 'జైలర్ 2' పూర్తయ్యాక 'రాక్' మొదలవుతుంట. 2026లో సెట్స్‌పైకి వెళ్లే ఈ సినిమాను సితార ఎంటర్టైన్మెంట్స్ పతాకంపై సూర్యదేవర నాగవంశీ నిర్మిస్తారు. ఈ సినిమాకు సంబంధించిన పూర్తి వివరాలు త్వరలో వెల్లడి కానున్నాయి.

## సగమై.. చెరిసగమై..



మంచు విష్ణు టైటిల్ రోల్‌లో భక్తిరస ప్రధానంగా రూపొందిస్తున్న చిత్రం 'కన్నప్ప'. పరమ శివభక్తుడు కన్నప్ప ఇతివృత్తమిది. ఏప్రిల్ 25న విడుదలకానుంది. సోమవారం ఈ సినిమా నుంచి 'సగమై...చెరిసగమై' అంటూ సాగే ఓ మెలోడీ గీతాన్ని విడుదల చేశారు. స్టీఫెన్ దేవస్సీ స్వరాల్ని అందించిన ఈ గీతాన్ని రేవంత్, సాహితి చాగంటి ఆలపించారు. శ్రీమణి రచించారు. ఈ పాటలో నాయకానాయికలు మంచు విష్ణు, ప్రీతి ముకుందన్‌ల కెమిస్ట్రీ ఆకట్టుకునేలా ఉంది. ఈ సినిమాలో అక్షయ్‌కుమార్ శివుడిగా, ప్రభాస్ రుద్రుడిగా, కాజల్ అగర్వాల్ పార్వతీదేవిగా కనిపించనున్నారు. మోహన్‌లాల్, మోహన్‌బాబు, బ్రహ్మానందం వంటి అగ్ర తారలు కీలక పాత్రల్లో నటిస్తున్నారు. అవా ఎంటర్టైన్‌మెంట్స్, 24 ఫ్రేమ్స్ ఫ్యాక్టరీ పతాకంపై మంచు మోహన్‌బాబు ఈ చిత్రాన్ని నిర్మించారు.




## గోపీచంద్ చారిత్రాత్మక చిత్రం

హీరో గోపీచంద్ కథానాయకుడిగా 'ఘాజీ'ఫేం సంకల్ప్ రెడ్డి దర్శకత్వంలో.. శ్రీనివాస్ చిట్టూరి నిర్మిస్తున్న చిత్రం షూటింగ్ సోమవారం హైదరాబాద్‌లోని ఓ దేవాలయంలో లాంఛనంగా మొదలైంది. 7వ శతాబ్దంలో జరిగే ఓ ముఖ్యమైన, ఇంకా అన్వేషించబడని ఓ చారిత్రక సంఘటన ఆధారంగా ఈ సినిమా రూపొందనున్నదని, భారతీయ వారసత్వం మరిచిపోయిన ఓ అధ్యాయానికి జీవం పోసే సినిమా ఇదని మేకర్స్ చెబుతున్నారు. ఇందులో గోపీచంద్ నెవర్ బిఫోర్ రోల్‌లో కనిపిస్తారని వారన్నారు. ఇంకా ఇతర తారాగణం ఖరారవ్వని ఈ సినిమాకి రచన: సురేష్‌బాబు, ప్రకాష్, కెమెరా: మణికందన్, సమర్పణ: పవన్‌కుమార్, నిర్మాణం: శ్రీనివాస సిల్వర్ స్క్రీన్.

## గోదావరిఖని నేపథ్యంలో ప్రేమకథ



'దసరా' దర్శకుడు శ్రీకాంత్ ఓదెల నిర్మాతగా మారుతున్నారు. సమ్మక్క సారక్క క్రియేషన్స్ పేరుతో నూతన నిర్మాణ సంస్థను ఆరంభించారు. తొలి ప్రయత్నంగా చాయ్ బిస్కెట్ ఫిల్మ్స్‌తో కలిసి 'ఏఐ అమీనా జరియా రుక్సానా-గులాబీ' పేరుతో ఓ ప్రేమకథను తెరకెక్కించబోతున్నారు. దీనికి ఆయనే కథనందిస్తున్నారు. చేతన్ బండి దర్శకుడిగా పరిచయమవుతున్నాడు. సోమవారం అనౌన్స్‌మెంట్ పోస్టర్‌ను విడుదల చేశారు. '2009లో గోదావరిఖని నేపథ్యంలో యథార్థ సంఘటనల ఆధారంగా ఈ చిత్రాన్ని తెరకెక్కించబోతున్నాం. ఒక అబ్బాయిని గాఢంగా ప్రేమించే అమ్మాయి తాలూకు లోతైన భావోద్వేగాలను ఆవిష్కరిస్తుంది. త్వరలో రెగ్యులర్ షూటింగ్‌ను మొదలుపెడతాం' అని మేకర్స్ తెలిపారు. ఈ చిత్రానికి కథ: శ్రీకాంత్ ఓదెల, నిర్మాతలు: శ్రీకాంత్ ఓదెల, అనురాగ్ రెడ్డి, శరత్‌చంద్ర, రచన-దర్శకత్వం: చేతన్ బండి.



## అదిదా సర్‌ప్రైజ్

నితిన్ కథానాయకుడిగా నటిస్తున్న తాజా చిత్రం 'రాబిన్ హుడ్'. వెంకీ కుడుముల దర్శకుడు. మైత్రీ మూవీ మేకర్స్ సంస్థ నిర్మిస్తున్నది. శ్రీలీల కథానాయిక. ఈ నెల 28న ప్రేక్షకుల ముందుకురానుంది. ఈ నేపథ్యంలో మ్యూజికల్ ప్రమోషన్స్‌ను వేగవంతం చేశారు. సోమవారం 'అదిదా సర్‌ప్రైజ్..' పేరుతో ప్రత్యేక గీతాన్ని విడుదల చేశారు. ఇందులో కేతిక శర్మ నర్తించింది. చంద్రబోస్ రాసిన ఈ గీతాన్ని అనురాగ్ కులకర్ణి ఆలపించారు. జీవీ ప్రకాష్ కుమార్ స్వరకర్త. హుషారెత్తించే మాస్ పాట ఇదని, ఈ ఏడాది హాటెస్ట్ సాంగ్‌గా నిలుస్తుందని, శేఖర్ మాస్టర్ నృత్యరీతులు ప్రధానాకర్షణగా నిలుస్తాయని చిత్ర బృందం పేర్కొంది. హీస్ట్ కామెడీ ఎంటర్‌టైనర్‌గా 'రాబిన్‌హుడ్' చిత్రాన్ని తెరకెక్కించారు. రాజేంద్రప్రసాద్, వెన్నెల కిషోర్ తదితరులు నటిస్తున్న ఈ చిత్రానికి నిర్మాతలు: నవీన్ యెర్నేని, వై.రవిశంకర్, రచన-దర్శకత్వం: వెంకీ కుడుముల.

## లాయర్ల మీద గౌరవం పెరిగింది



- 'ఈ సినిమా విషయంలో చాలా జాగ్రత్తలు తీసుకున్నాం. మన చట్టాల్లోని సెక్షన్లను మరచిపోకుండా గుర్తుపెట్టుకున్నా. ప్రతి సీన్ రియలిస్టిక్‌గా ఉండేలా చూసుకున్నాం' అన్నారు ప్రియదర్శి. ఆయన ప్రధాన పాత్రలో నటించిన చిత్రం 'కోర్ట్-స్టేట్ వర్సెస్ ఏ నోబడీ'. రామ్‌జగదీష్ దర్శకత్వం వహించిన ఈ చిత్రాన్ని ప్రశాంతి తిపిర్నేని నిర్మించారు. హీరో నాని సమర్పకుడు. ఈ నెల 14న విడుదలకానుంది. ఈ సందర్భంగా సోమవారం ప్రియదర్శి పాత్రికేయులతో పంచుకున్న విశేషాలు..
- దాదాపు మూడేళ్ల క్రితం దర్శకుడు రామ్ జగదీష్ ఈ స్టోరీ ఐడియా చెప్పాడు. బాగుందనిపించింది. ఆరు నెలల తర్వాత కథ మొత్తం రాసుకొచ్చాడు. ఇలాంటి కథల్ని తప్పకుండా ప్రేక్షకులకు చెప్పాలనిపించింది. గోవాలో 'హాయ్ నాన్న' షూటింగ్ టైమ్‌లో నానికి ఈ కథ గురించి చెప్పా. ఆయనకు బాగా నచ్చి 'ఈ సినిమా మనం చేస్తున్నాం' అన్నారు. అలా ఈ సినిమా పట్టాలెక్కింది
- పోక్సో కేసు నేపథ్యంలో నడిచే కోర్ట్ రూమ్ డ్రామా ఇది. ఈ సినిమా కోసం దర్శకుడు చాలా హార్డ్‌వర్క్ చేశాడు. కొంతమంది లాయర్లను కలిసి పోక్సో చట్టం గురించి, దానికి విధించే శిక్షల గురించి తెలుసుకున్నాడు. ఈ తరహా కేసుల్లో వెలువడిన తీర్పుల ద్వారా ఒక మెటీరియల్‌ను తయారు చేశాడు. వాటిని నాకు కూడా ఇచ్చాడు.
- ఈ క్యారెక్టర్ కోసం మన కోర్టుల్లో లాయర్లు, జడ్జీలు వాడే భాష, వారి వస్త్రధారణ.. ఇలా ప్రతి విషయాన్ని జాగ్రత్తగా గమనించాను. నిజమైన లాయర్‌గా కనిపించే ప్రయత్నం చేశా. సెక్షన్లను కూడా మర్చిపోకుండా గుర్తుపెట్టుకున్నా. ఈ క్యారెక్టర్ చేస్తున్నప్పుడు లాయర్ల మీద గౌరవం పెరిగింది. అంబేద్కర్ గారు రాసిన రాజ్యాంగం మనకు ఎంతగా ఉపయోగపడుతుందో అర్థమైంది. ఈ సినిమాను బార్ కౌన్సిల్ వారికి కూడా చూపిద్దామనుకుంటున్నాం.
- ఈ సినిమా చూశాక నాని..'నేను ఏదో అనుకున్నా కానీ చాలా బాగా వచ్చింది' అంటూ సంతృప్తి వ్యక్తం చేశాడు. ఓ నటుడిగా ఇలాంటి కథల్ని ప్రేక్షకులకు చెప్పాల్సిన బాధ్యత నాపై ఉందనుకుంటున్నా. శాంతా బయోటెక్ వ్యవస్థాపకుడు కేఐ వరప్రసాద్‌గారి బయోపిక్‌లో నటించాలని ఎప్పటినుంచో అనుకుంటున్నా. అది నా డ్రీమ్ రోల్. నా తదుపరి చిత్రం 'సారంగపాణి జాతకం' ఏప్రిల్‌లో రిలీజ్ అవుతుంది. గీతా ఆర్ట్స్‌లో కూడా ఓ సినిమా సైన్ చేశాను.



'నాకెలాంటి సినీ నేపథ్యం లేదు. కానీ హీరోయిన్ కావాలని చిన్నప్పట్నుంచీ ఆశ. అందుకే.. ముందు మోడలింగ్‌లోకి దిగా. తర్వాత తెలిగ్గా సినిమాల్లోకి ఎంట్రీ ఇవ్వగలిగా.' అంటూ ఓ ఆంగ్ల పత్రికకు ఇచ్చిన ఇంటర్వ్యూలో పేర్కొన్నది అందాలభామ నిధి అగర్వాల్. తాను చేస్తున్న సినిమాల గురించి మాట్లాడుతూ

## రాజాసాబ్‌లో నాది ఆ పాత్ర కాదు

'ప్రస్తుతం తెలుగులో రెండు సినిమాలు చేస్తున్నా. రెండూ పానిండియా ప్రాజెక్టులే. వాటిలో ఒకటి 'హరిహర వీరమల్లు' కాగా, రెండోది 'ది రాజాసాబ్'. రెండూ భిన్నమైన కథలే. వీటిలో 'హరిహర వీరమల్లు'.. పీరియాడిక్ అంశాలతో కూడిన ఫిక్షన్ కథ. ఈ సినిమాకోసం రెండున్నర నెలలు గుర్రపుస్వారీ నేర్చుకున్నా. భరతనాట్యం, కథక్‌లోనూ శిక్షణ తీసుకున్నా. కల్యాణ్‌సార్‌తో నటించడం మరిచిపోలేని అనుభవం. ఆయన గొప్ప మేధావి. సాహిత్యాభిమాని కూడా. ఇక 'ది రాజాసాబ్' సినిమా విషయానికొస్తే.. అది హారర్ కామెడీ మూవీ. అందులో నేను దెయ్యం పాత్ర పోషిస్తున్నానని చాలామంది అనుకుంటున్నారు. అందులో నిజంలేదు. అందులో నాపాత్ర అందర్నీ ఆశ్చర్యపరిచేలా, పూర్తి వినోదాత్మకంగా ఉంటుంది. నా కెరీర్‌లో ఇలాంటి భారీ సినిమాల్లో భాగం అవుతానని కలలో కూడా అనుకోలేదు.' అంటూ చెప్పుకొచ్చింది నిధి అగర్వాల్.



## కలహాలు లేని ప్రేమకథ

వినయ్‌కుమార్, శ్రావణి, అరవింద్, నోమిన ప్రధాన పాత్రల్లో నటిస్తున్న చిత్రం 'కాలమేగా కరిగింది'. 'కలహాలే లేని ఓ ప్రేమకథ' ఉపశీర్షిక. సింగార మోహన్ దర్శకుడు. ప్రపంచ కవితా దినోత్సవం సందర్భంగా ఈ నెల 21న ప్రేక్షకుల ముందుకురానుంది. 'పొయెటిక్ లవ్‌స్టోరీ ఇది. అందమైన భావనలతో హృద్యంగా సాగుతుంది. ఇప్పటికే విడుదల చేసిన పాటలకు మంచి స్పందన లభిస్తున్నది' అని చిత్రబృందం పేర్కొంది. ఈ చిత్రానికి కెమెరా: వినీత్ పబ్బతి, సంగీతం: గుడప్పన్, నిర్మాత: మరే శివశంకర్, రచన-దర్శకత్వం: సింగార మోహన్.

## అందుకే 'అవతార్'ని వదులుకున్నా..



హాలీవుడ్‌లో నటించడం గౌరవంగా భావించే భారతీయ నటులు కోకొల్లలు. అందునా.. 'అవతార్' లాంటి సినిమాలో అవకాశం వస్తే ఎవరైనా వదులుకుంటారా?!. కానీ బాలీవుడ్ హీరో గోవిందా వదులుకున్నారట. ఆయనే స్వయంగా ఓ ఇంటర్వ్యూలో ఈ విషయాన్ని వెల్లడించారు. 'అమెరికాలో సర్దార్ అని నా ఫ్రెండ్ ఉన్నాడు. అతనికి బిజినెస్‌లో ఓ ఐడియా ఇచ్చా. అది బాగా వర్కవుట్ అయ్యింది. దాంతో తను బాగా సంపాదించాడు. ఓ రోజు జేమ్స్ కామెరూన్ దగ్గరకు సర్దార్ నన్ను తీసుకెళ్లాడు. ఆ దిగ్గజ దర్శకుడితో కలిసి డిన్నర్ చేశా. అప్పుడే ఆయన నాకు 'అవతార్' గురించి చెప్పారు. కథను కూడా సూచాయగా వివరించారు. అందులో కీలకమైన 'స్పైడర్' పాత్రను నన్ను చేయమన్నారు. 18కోట్లు ఆఫర్ కూడా ఇచ్చారు. 410రోజులు పనిచేయాలని చెప్పారు. నేను కూడా ఓకే అన్నాను. కానీ శరీరానికి పెయింట్ పూసుకొని నటించాలన్నారు. దాంతో ఆ ఆఫర్‌ని వదులుకున్నా. సినిమా విడుదలయ్యాక.. నాకు ఆఫర్ చేసిన పాత్రలో నటించిన నటుడ్ని చూసి ఆశ్చర్యపోయాను. అంతగొప్ప అవకాశాన్ని మిస్ చేసుకున్నందుకు తెగ బాధపడిపోయా. ఇప్పటికీ ఆ విషయం గుర్తొస్తే.. గుండె బరువుగానే ఉంటుంది.' అన్నారు గోవిందా.

## జ్ఞాపకాల హోంటౌన్



ఇంటి చుట్టూ అల్లుకున్న జ్ఞాపకాలు, బంధాల నేపథ్యంలో రూపొందిన వెబ్ సిరీస్ 'హోం టౌన్'. రాజీవ్ కనకాల, ఝాన్సీ, ప్రజ్వల్ యాద్మ, సాయిరామ్, అనీ, అనిరుధ్, జ్యోతి కీలక పాత్రధారులు. శ్రీకాంత్‌రెడ్డి పల్లే దర్శకుడు. వచ్చే నెల 4 నుంచి ఓటీటీ ప్లాట్‌ఫాం ఆహాలో ఈ సిరీస్ స్ట్రీమింగ్ కానుంది. ఈ సందర్భంగా సోమవారం ఈ సిరీస్‌కు సంబంధించిన టీజర్‌ని రిలీజ్ చేశారు. ఇంకా ఇంటర్నెట్ విస్తృతంగా అందుబాటులోకి రాని 2000 సంవత్సరంలో ఓ అందమైన గ్రామం నేపథ్యంగా ఈ సిరీస్ కథ సాగుతుందని టీజర్ చెబుతున్నది. ఇంటర్నెట్ మొదలైన కొత్తలో సోషల్ మీడియా అంటే తెలియని ముగ్గురు విద్యార్థులు చేసే ఫన్ నవ్విస్తుందని, స్కూల్ లైఫ్‌లో విద్యార్థులు చేసే సరదా పనులు, అప్పుడే మొదలైన ప్రేమలు.. వంటి అంశాలతో అందరికీ రిలేట్ అయ్యేలా ఈ 'హోం టౌన్' అంటుందని మేకర్స్ చెబుతున్నారు. ఈ సిరీస్‌కి కెమెరా: దేవ్ దీప్ గాంధీ కుండు, సంగీతం: సురేష్ బొబ్బిలి, నిర్మాతలు: నవీన్ మేడారం, శేఖర్ మేడారం.